క్లుప్తంగా

నిర్మాణ సామగ్రి అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ ఇంటి నిర్మాణానికి, మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం అండగా నిలిచారు. సోమవారం వంద సిమెంట్ బస్తాలను అందజేశారు. అవసరమైతే మరింత సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి కల్పించండి

ఆమనగల్లు: జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచితంగా టైలర్ శిక్షణ పొందిన తమకు.. ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్లు ఇవ్వాలని పలువురు మహిళలు కోరారు. సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రోడ్డుకు మరమ్మతు



రోడ్డును చదును చేయిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం లింగరావ్‌పల్లి– పడకల్ రోడ్డు అధ్వానంగా మారింది. స్థానికుల విన్నపం మేరకు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి.. సొంత నిధులతో సోమవారం మట్టిని పోయించి చదును చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతయ్య, మాజీ ఉపసర్పంచ్ మణికంఠ, నాయకులు బాల్‌రెడ్డి, యాదయ్య, రాములు, రమేశ్, భాస్కర్, సుమంత్ తదితరులు ఉన్నారు.

రేపు రేషన్‌కార్డుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: కొత్త రేషన్ కార్డులను ఇబ్రహీంపట్నం శాస్త్ర గార్డెన్‌లో బుధవారం పంపిణీ చేయనున్నామని రెవెన్యూ అధికారులు సోమవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలు, మండల పరిధి 14 గ్రామ పంచాయతీల్లో అర్హులైన సుమారు 1500 మందికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నూతన కార్డులు అందజేయనున్నారని పేర్కొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

మంచాల: జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు లాలగారి జంగయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జ్యాబ్ క్యాలెండర్ ప్రకటించి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అందు కోసం నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు.

ప్రజావాణిలో మూడు అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సునితారెడ్డి

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 3 అర్జీలు అందాయి. ఆర్డీఓ స్థానంలో తహసీల్దార్ సునితారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలపై రెండు ఫిర్యాదులు అందగా.. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి పనితీరును మెరుగుపరచాలని, 24 గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని బీజేపీ టౌన్ అధ్యక్షుడు ముత్యాల మహేందర్ మరో అర్జీని అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు పొందండి

యాచారం: పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెలాఖరు వరకు అడ్మిషన్లు పొందాలని యాచారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో మెరుగైన విద్యాబోధన అందుతున్నారు. ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉపకార వేతనాలు అందుతాయని, ఎన్‌సీసీ సేవా కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఎంపీడీఓ రాధారాణి



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

యాచారం: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉందని, క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీడీఓ రాధారాణి సూచించారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వంటగదిని, సామగ్రిని పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం వండి పెడుతున్నారా అని సిబ్బందిని, మెరుగైన విద్యాబోధన అందుతుందాని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య ఉన్నారు.

చిక్కుముడి వీడేదెన్నడు?

- ఫార్మా భూ పరిహారం అథారిటీలో జమ
- రికార్డులు టీజీఐఐసీ పేరిట మార్పు
- ఆర్డీఓ కార్యాలయంలో ప్లాట్ల సర్టిఫికెట్లు
- భూములు ఇవ్వని రైతుల దీనస్థితి
- న్యాయస్థానం తీర్పుపై ఆశలు



టీజీఐఐసీ పేరిట మార్చిన తాడిపర్తి- కుర్మిద్ద గ్రామాల మధ్యన పట్టా భూమి

యాచారం: ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కోర్టులకు వెళితే న్యాయం జరుగుతుందనే ఆశలు ఒకవైపు, అధికారుల మాటలు వింటే జాగలు పోతాయేమోనన్న ఆందోళన మరోవైపు వెంటాడుతోంది. వెరసి కర్షకుల కంటికి కునుకు కరువైంది. అధికారులు కూడా మొండివైఖరితో ఉన్నారని, రైతులు వాళ్లంతట వారు వస్తే సరి. లేదంటే నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తామని చెబుతున్నట్లు సమాచారం.

సహకరించని పెద్దలు

బీఆర్ఎస్ హయాంలో ఫార్మాకు వ్యతిరేకంగా మద్దతుగా నిలిచిన ప్రస్తుత అధికార పార్టీ పెద్దల నుంచి.. రైతులకు భరోసా లేకుండా పోయింది. ప్రభుత్వ పెద్దలను ఇష్టానుసారంగా దూషిస్తున్న నేపథ్యంలో వారి మద్దతును కోల్పోయినట్లు తెలుస్తోంది. తాము ఫార్మాసిటీకి వ్యతిరేకమే. కానీ.. భూములు ఉంచాలన్నా.. తీసుకోవాలన్నా అధికారుల నిర్ణయమని, అయినా ఆ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున తామేమి మాట్లాడలేమని కాంగ్రెస్ నేతలు పేర్కొనడం గమనార్హం.

అథారిటీలో పరిహారం

ఫార్మాకు పట్టా భూములు ఇవ్వని రైతులపై అధికార యంత్రాంగం కన్నెర్రజేసింది. యాచారం మండలం నక్కర్తమేడిపల్లి– 483.25 ఎకరాలు, నానక్‌నగర్– 154.16, తాడిపర్తి– 382.35, కుర్మిద్ద– 974.06 ఎకరాలతో పాటు మరో 216 ఎకరాలు కలిపి.. సుమారు 900 మందికి పైగా రైతులకు చెందిన 2,211 ఎకరాల పట్టా భూమికి రాత్రికి, రాత్రే అవార్డులు పాస్ చేసింది. ఎకరాకు రూ.8 లక్షల చొప్పున రూ.176 కోట్ల 88 లక్షల పరిహారాన్ని అథారిటీలో జమ చేసింది. అప్పట్లో అంగీకారం తెలిపి, భూములు ఇచ్చిన వారికి ఎకరాకు రూ.16 లక్షల పరిహారం ఇచ్చి, భూములివ్వని వారికి ఎకరాకు రూ.8 లక్షల చొప్పున అథారిటీ(ప్రత్యేక కోర్టు)లో జమ చేసింది. అ డబ్బును బాధిత రైతులు తీసుకుంటారా లేదా అనేది వారి ఇష్టంపై ఆధారపడుందని అధికారులు అంటున్నారు.

ఎకరాకు 121 గజాల ప్లాటు

నాలుగు గ్రామాల్లోని 2,211 ఎకరాల పట్టా భూములకు సంబంధించి పరిహారాన్ని అథారిటీలో జమ చేయడం, భూ రికార్డులను టీజీఐఐసీ పేరిట మార్చడం పూర్తయింది. ఆ భూములు సర్కార్ స్వాధీనంలోనే ఉన్నట్లు భావిస్తూ.. బాధిత రైతులకు కందుకూరు మండలం మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ మెగా వెంచర్‌లో ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లను సిద్ధం చేసింది. లాటరీలో వారి పేర్లను ప్రకటించింది. పట్టా భూముల రైతులు ఆ ప్రక్రియలో పాల్గొనకపోవడంతో ఆ పత్రాలు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో ఉన్నాయి. రైతులకు మాత్రం టీజీఐఐసీ మెగా వెంచర్‌లో ప్లాట్లను కేటాయించారు. టీజీఐఐసీ పేరిట ఉన్న 2,211 ఎకరాలను ప్రభుత్వానికి ఇస్తే.. అథారిటీలో జమ చేసిన పరిహారానికి బదులు రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల్లోపు అందజేస్తామని అధికార యంత్రాంగం చెబుతోంది.

“అన్యాయం చేయం”



ఫార్మా భూసేకరణలో నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నాం. పరిహారం కింద నాటి ప్రభుత్వం ఎకరాకు రూ.8 లక్షలను అథారిటీలో జమ చేసింది. రైతులు అంగీకరిస్తే పరిహారం మరింత పెంచే అవకాశం ఉంది. రైతుల మేలు కోరుతున్నాం. అన్యాయం చేసే ఉద్దేశం లేదు. ఆ భూములు ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నట్లే.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

హక్కులు కోల్పోయినట్లే

ఫార్మాకు భూములు ఇవ్వడం లేదని 2,211 ఎకరాల పట్టా భూముల పరిహారాన్ని అథారిటీలో జమ చేసిన అధికార యంత్రాంగం.. రైతుల పేటిర ఉన్న భూ రికార్డులను టీజీఐఐసీ పేరిట మార్చేసింది. నేటికీ ఆ భూములను రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నప్పటికీ.. రికార్డుల్లో మాత్రం వారి పేర్లు లేవు. రికార్డులు టీజీఐఐసీ పేరిట ఉండడంతో ఆ భూములపై సర్వ హక్కులు సంస్థకే ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సంస్థ పేరిట భూ రికార్డులు ఉండటంతో.. నాలుగేళ్లుగా రైతులకు బ్యాంకు రుణాలు, రైతుబంధు, రైతు భరోసా, అత్యవసర పరిస్థితుల్లో క్రయ, విక్రయాలు జరిపే అవకాశాలు లేకుండా పోయాయి.

ప్రభుత్వాలు మారినా సంక్షేమం ఆగొద్దు

ఎమ్మెల్యే సబితారెడ్డి



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

బడంగ్‌పేట్: ప్రభుత్వాలు మారిన సంక్షేమం ఆగకూడదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం బాలాపూర్ మండల కార్యాలయం ఆధ్వర్యంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బడంగ్‌పేట్‌లోని ప్రజాభవన్ ఫంక్షన్‌హాలులో చేపట్టారు. కార్పొరేషన్‌లో 1003, జల్‌పల్లి మున్సిపాలిటీలో 319 కలిపి మొత్తంగా 1,322 కార్డులు మంజూరు కాగా.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి హాజరై అర్హులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వాలు మారినా అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించే బాధ్యత ఉంటుందన్నారు.

రేషన్‌కార్డులు ఇచ్చి చూపించాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతీ పేదవారికి రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పినా మాట నిలబెట్టుకున్నామని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్ల నర్సింహారెడ్డి అన్నారు. అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కమిషనర్ పి.సరస్వతి, తహసీల్దార్ ఇందిరాదేవి, నయాబ్ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పలహారం బండి ఊరేగింపు

మీర్‌పేట: బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం మీర్‌పేట ఓల్డ్ విలేజ్‌లో అమ్మవారి పలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. పలహారం బండిని వీధుల గుండా ఊరేగింపు చేపట్టి.. పోచమ్మ దేవాలయం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు.



పలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న స్థానికులు

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని వినతి

కందుకూరు: తమ గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పరిధిలోని లేమూరు గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో మద్యపాన నిషేధం జరిగేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మద్యం విక్రయించొద్దని బెల్టు షాపుల నిర్వాహకులకు చెప్పినా ఫలితం లేదన్నారు. ఎక్సైజ్ అధికారుల ద్వారా అమ్మకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోరుప్రోలు రాజాప్రతాప్‌రెడ్డి, మంచాల భాస్కర్, గుల్వి మహిపాల్, డప్పు మహేందర్, గంగరి నర్సింహ, గంగరి గణేష్, పులి వెంకటేశ్, డప్పు కరుణాకర్, మంచాల సంజీవ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు భీమయ్య ఆర్థికసాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం కెమెరాలను ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో సీత్లా సంబురం



ఆమనగల్లు: మేడిగడ్డతండాలో సీత్లా భవానీ పూజలో భక్తులు

ఆమనగల్లు: ప్రకృతిని పూజించే గిరిజన ఉత్సవాల్లో సీత్లా పండుగ ఒకటి. సోమవారం ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీత్లా భవానీ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో పూజారి పతంగి నాగఫణిశర్మ నేతృత్వంలో హోమం జరిపించారు. పాడి పంటలు, ప్రజలకు సుఖసంతోషంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మంగళవారం సీత్లామాత ఊరేగింపు, నైవేద్యం సమర్పణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనిత, మాజీ సర్పంచ్ అంబర్‌సింగ్, రేషన్‌డీలర్ కృష్ణ, నాయకులు మల్లేశ్, పాండు, శంకర్, పత్య, హన్మ, సురేశ్, తావుర్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నార్లకుంటతండాలో..

కడ్తాల్: మండల పరిధి నార్లకుంటతండాలో గిరిజనులు భక్తి శ్రద్ధలతో సీత్లా పండుగ జరుపుకొన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలతో పల్లెలు కళకళలాడాలని కోరుకున్నారు. గిరిజనులు ఊరేగింపుగా వెళ్లి, సీత్లా మాతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా యువతీ యువకులు నృత్యాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, నాయకులు దేవుజా, వెంకట్రాములు, భాస్కర్, రమేశ్, శ్రీను, లక్ష్మణ్, యాదయ్య తదితరులు ఉన్నారు.



కడ్తాల్: నైవేద్యంతో ఊరేగింపుగా వెళ్తున్న గిరిజన మహిళలు

యూరియా ఉంది.. ఆందోళన వద్దు

వ్యవసాయ అధికారులు



ఆమనగల్లు: ఎరువు నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: అవసరమైన యూరియా అందుబాటులో ఉంది. రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆమనగల్లు పట్టణంలోని ఎరువుల డీలర్ల వద్ద ఉన్న నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో 150 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 70 టన్నుల డీఏపీ, 129 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఎరువులు అవసరమైన వారు.. ఆధార్ కార్డు తీసుకువచ్చి తీసుకెళ్లానని సూచించారు.

మాడ్గులలో..

మాడ్గుల: సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలోని నిల్వలను ఆమె సోమవారం పరిశీలించారు. సీజన్‌కు సరిపడా యూరియా సకాలంలో అందిస్తున్నామని తెలిపారు. గోదాంలో 3600 బస్తాల యూరియా ఉందని పేర్కొన్నారు. అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని సూచించారు.

జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



మాడ్గులలో.. జైపాల్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: నేటి యువతకు కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత జైపాల్ రెడ్డి జీవితం ఆదర్శనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాండు గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా, నాయకులు యాదయ్య, విష్ణు, జంగయ్య, రాములు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

బడంగ్‌పేట్: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఆహార భద్రతకార్డుల(రేషన్‌కార్డులు) ప్రక్రియ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలల్లో ఎన్నడూ లేని విధంగా మొదటిసారి పెద్దఎత్తున రేషన్‌కార్డుల పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందిస్తూ ప్రజల్లో సంతోషాన్ని నింపిందన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

మాజీ మేయర్ పారిజాత



డీఈఈ వెంకన్నతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న పారిజాత

బడంగ్‌పేట్: బాలాపూర్–బడంగ్‌పేట్ ఆర్‌సీఐ ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ మేయర్ చిగురింత పారిజాత డీఈఈ వెంకన్నను కోరారు. సోమవారం 31వ డివిజన్‌లోని లక్ష్మీనగర్, శాంతి నగర్ కాలనీల్లో ఆమె పర్యటించారు. డీఈఈతో కలిసి బడంగ్‌పేట్ టూ బాలాపూర్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరించాలన్నారు. అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఈ హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వార్డు ఆఫీసర్లు శ్రీకాంత్, శ్రీనివాస్‌గుప్తా, గిరి ముదిరాజ్, శివకుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



కడ్తాల్: అర్హులకు నూతన రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- పర్యావరణ రక్షణకు కృషి చేయాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ఆమనగల్లు/ కడ్తాల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలో తొలుత వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటాడారు. మొక్కలు నాటి పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక ఎంబీఏ గార్డెన్‌లో పలువురు అర్హులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు, ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలం నుంచే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని పేర్కొన్నారు. మండల పరిధిలో కొత్తగా 1,485 రేషన్ కార్డులు అందజేశారు.

కార్మికులకు ధ్రువపత్రాలు

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోతుగంటి అశోక్ పర్యవేక్షణలో పదిహేను రోజులుగా మండలంలోని వంపుగూడలో భవన నిర్మాణ కార్మికులు శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న 28 మందికి ఎమ్మెల్యే కసిరెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, ఎఎంసీ చైర్మన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత, ఆర్ఐ రాజిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, వెంకటేశ్, నరేశ్‌నాయక్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయన సేవలు చిరస్మరణీయం

ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి సూదిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాపాలనలో పేదలకు న్యాయం

కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో నిరు పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో సోమవారం పలువురు అర్హులకు నూతన రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ శంకర్, నాయకులు నారాయణ, మెకానిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.